# ముగింపులేని కథ

సుస్మితా రమణమూర్తి

నాలుగు ఒకట్లు నాలుగు.

నాలుగు రెళ్ళు ఎనిమిది

నాలుగు మూళ్ళు తొమ్మిది

"రేయ్! శ్రీనూ! నాలుగు మూళ్ళెంతరా?"

"నాలుగు ఒకట్ల నాలుగు నాలుగురెళ్ల ఎనిమిది నాలుగు మూళ్ళు తొమ్మిది నాలుగు మూళ్ళు తొమ్మిదండీ మాష్టారూ!"

"వెధవా! నా దగ్గర చేరి అప్పుడే రెండు నెలలు కావస్తోంది ఇంకా నాలుగో ఎక్కంకూడా రాలేదంటే నాక్కాదట్రా నామోషీ? ఆ మూలకెళ్ళి గోడకుర్చీ వేయ్ అప్పుడుగాని నీకు ఎక్కం ఒంటబట్టదు"

ఆ నాలుగో ఎక్కం కుర్రాడు సీతాపతి చెప్పిందే తడవుగా గోడకుర్చీవేసి ఎక్కం చదువుకోసాగేడు సీతాపతి ఏ స్కూల్లోనూ మాష్టరుగిరీ వెలగపెట్టటం లేదు

తను చదువుకుంది పాత కాలంలో ఇంటర్మీడియట్ అయినా ఇప్పటి డిగ్రీ పిల్లలకుకూడా ప్రైవేటు చెప్పగల సామర్ధ్యం గలవాడు సీతాపతి ట్రయినింగైన మాష్టార్లుకూడా చెప్పలేనంత సులభంగా అరటిపండు ఒలిచి నోట్లో పెట్టేంత సునాయాసంగా పిల్లలకు పాఠాలు చెప్పగలడు సీతాపతి అందుకనే చాలామంది కుర్రాళ్ళు తమకు తామే స్కూలు మాష్టార్ల దగ్గరకి ప్రైవేటుకి పోకుండా—సీతాపతి దగ్గరికే వస్తుంటారు

కొందరుతలిదండ్రులు సీతాపతి బోధనా పద్ధతిని-తన సామర్ధ్యాన్ని గ్రహించి తమ పిల్లలను సీతాపతి దగ్గరకే పంపిస్తుంటారు.

వాళ్ళ విశ్వాసం సడలక పోవడానికి కారణం—సీతాపతి దగ్గర చదువుకునే పిల్లలు నూటికి ఎనభై మంది మంచి మార్కులతో పాసవుతుండటమే!

తను చేస్తూంది గుమాస్తాగిరైనా సీతాపతి బాధపడడు.

ప్రైవేట్లద్వారా మరో జీతం ఎలానూ వస్తోందిగనక

ఇప్పటి పరిస్థితుల్ని బట్టి చెప్పుకోవాలంటే సీతాపతి బహు కుటుంబీకుడే!

ముచ్చటగా ముగ్గురబ్బాయిలు—ముగ్గురమ్మాయిలు ఆ తర్వాత ఫుల్‌స్టాప్!

ఇద్దరబ్బాయిల చదువులైపోయాయ్. మూడోవాడు ఇంకా చదువుని కొంటూనే వున్నాడు.

పెద్దమ్మాయి పదివేల కట్నంతో పెళ్ళికొడుకుని కొనుక్కోవడం-తన బ్రతుకుని సుఖమయం చేసుకోడం జరిగి ఏణ్నర్ధం దాటింది రెండో అమ్మాయి పెళ్ళికోసం తను ప్రయత్నాలు చేస్తున్నా ఫలించక పోవటంతో సీతాపతి అప్పుడప్పుడు బాధపడేవాడు

"ఏమండోయ్! తొమ్మిది కావస్తోంది ఇంవేల్టికిక పాఠాలు చాలించండి మీతో అర్జంటుగా మాట్లాడాలంటూ కొంతమంది వచ్చేరు వరండాలో బెంచీలమీద కూర్చు

న్నారు. వాళ్ళొచ్చి అప్పుడే పదినిముషాలు కావస్తోంది ఎంతసేపని వాళ్ళనలా కూర్చో బెడతారు? వెంటనే వెళ్ళి వాళ్ళతో మాట్లాడండి " ఆర్డరేసింది-లోపల్నుంచే సీతాపతి భార్యామణి అన్నపూర్ణ

వెంటనే సీతాపతి వాళ్ళున్న దగ్గరికి వెళ్ళేడు

"నమస్కారఁవండీ!"

ప్రతినమస్కారం చేసి సీతాపతి ప్రక్కనే వున్న వాలుకుర్చీలో కూర్చున్నాడు

"బాబూ! ఏదో మీ దయవల్ల మావాడు పదో క్లాసు మెట్టెక్క గలిగేడు మా సంతోషంకొద్దీ ఈ చిన్న కానుక కాదనకండి " అంటూ ఒకతను వందరూపాయ ల్నోటొకటి సీతాపతికిస్తూ అన్నాడు

"మళ్ళీ ఎందుకండీ? అప్పుడెలాగూ ఐదొందలు ఇచ్చేరుగా!" ఆ నోటు తీసుకుంటూ అన్నాడు—సీతాపతి

"మీ కష్టం ఆ మాత్రం మాకు తెలవదా బాబూ? మార్కులేయించడంకోసం తఁవరు అయిదరాబాదు ఎల్లి ఎంత కష్టపడ్డారో?"

"సర్లెండి! ఇప్పుడవన్నీ ఎందుకు? నే చేయగలిగిందేదో చేశాను మీవాడు పాసయాడు నా కంతే చాలు" సీతాపతి

"వస్తాను బాబూ!" అంటూ ఆ వ్యక్తి వెళ్ళిపోయాడు

ఇలాంటి 'డిటో' కేసులు పావు గంటలో ఓ అరింటిని పూర్తిచేసి, వాళ్ళిచ్చిన పెద్ద నోట్లను తన చిన్నజేబులో దాచుకున్నాడు సీతాపతి

ఆ తర్వాత మూడు కేసులూ ఫెయిల్యూర్ కేసులు!

"వెంకన్నా! పీవెందుకొచ్చావో నాకు తెలుసు ఏం చేయను? మీ వాడికి మరీ తక్కువ మార్కులొచ్చాయ్. ఓ నాలుగో, ఐదో మార్కులైతే వేయించేసేవాణ్ణి! పదులు, పాతికలు వస్తే ఎవరు మాత్రం ఏం చేయగలరు? ఇదేవైఁనా మామూలు స్కూలు పరీక్షా? ఎలాగోలా మళ్ళీ పేపరు రాయించడానికి పబ్లిక్ పరీక్షలు అలా కాదుగా? ప్రయత్నించినా లాభంలేక పోయింది కష్టపడి చదవమను ఈసారి గట్టిగా ప్రయత్నిద్దాం"అంటూ ఇదివరలో తను తీసుకున్న డబ్బు వెంకన్నకి ఇచ్చేశాడు సీతాపతి


ఓ వంద నోటు వెంకన్న సీతాపతికిస్తూ అన్నాడు "ఈ వంద మీ దగ్గరుంచండి చేయాల్సిన ప్రయత్నం మీరెలాగూ చేశారుగా. మా వాడి గురించి హైదరాబాదు కూడా వెళ్ళొచ్చేరు మా పని జరిగినా జరక్కపోయినా—మా గురించి మీరు ఖర్చుపెట్టడం దేనికండీ!"

ఆ వ్యక్తి సంతోషం కోసఁవా?— అన్నట్లు తనిచ్చిన వంద తీసుకున్నాడు సీతాపతి

మిగిలిన ఫెయిల్యూర్ కేసుల్ని కూడా పది నిముషాల్లో పూర్తి చేశాడు సీతాపతి

'ఈ రోజైనా తను ఆఫీసుకి లేట్ కాకూడదు' అనుకుంటూ లేవబోతుంటే, "నమస్కారమండీ! సీతాపతిగారూ!" అంటూ ఒకతను వచ్చేడు.

"ఏఁవిటండీ, రామంగారూ! మీ వాడికి ఉద్యోగం వచ్చినట్లేనా?" అడిగేడు సీతాపతి



"మీలాంటివాళ్ళు పూనుకుం తర్వాత ఎందుకు రాదండీ ఉద్యోగం?" అన్నాడు రామం

"ఇందులో నాదేముంది లెండి? మీ వాడికి వుద్యోగం వచ్చే యోగం వుంది కాబట్టి వచ్చింది "

"అలా అనకండి మీ ఆఫీసులో మీకున్న పలుకుబడి—మీ ప్రయత్నం మా వాడికి వుద్యోగం వచ్చేటట్లు చేశాయ్ "

"నా దేముంది లెండి! నా దంతా కేవలం మాట సాయంమాత్రమే! ఎన్నో ఏళ్ళనుంచి ఆ ఆఫీసులో పాతుకుపోయిన వాణ్ణి కాబట్టి—ఇదివర్లో ఇంటర్వ్యూలు ఎలా జరిగాయో—మోడల్ పేపర్స్ ఎలా వుంటాయో—మీవాడికి చెప్పగలిగేను మీవాడు కష్టపడి చదివిన చదువుకి ఫలితంగా మంచి వుద్యోగం వచ్చిందంతే."


"నిండుకుండ లెప్పుడూ తొణకవని మన పెద్దోళ్ళు వట్టినే అన్లేదు. మీ లాంటి వాళ్ళని దృష్టిలో పెట్టుకునే అనుంటారు. ఏదో మా తృప్తికోసం—మన పరిచయం కోసం—ఈ వుంగరం మీరు స్వీకరించాలి" అంటూ ఆ వ్యక్తి చిన్న అట్టపెట్టె లోంచి వుంగరం తీసి—సీతాపతికి ఇస్తూ అన్నాడు

"అబ్బే! ఇప్పు డెందుకండీ? మీ రెలాగూ వుద్యోగంకోసం ప్రత్యక్షంగా కాకపోయినా పరోక్షంగా ఆఫీసరుకి వెయ్యి రూపాయలు ముడుపు కట్టేరుగా? "

"అలా అనకండి డబ్బు పోయినా ఈ రోజుల్లో వుద్యోగం దొరకడం అంటే మాటలా!? డబ్బుపోయినా మా వాడికి బంగారంలాంటి వుద్యోగం వచ్చింది కాదనకండి ఏదో మా తృప్తికోసం!" అంటూ తను సీతాపతి చేతిలో అట్టపెట్టె నుంచుతూ అన్నాడు

సీతాపతి కాదనలేకపోయాడు

**జ్యోతి కథకార్టూన్** **ముగింపులేని కథ**




"మరి నాకు సెలవిప్పించండి" అంటూ తను వెళ్ళిపోయాడు

"ఏవిటండీ! మీ వుద్దేశం!? ఊళ్ళో వాళ్ళందరిపైన చూపించే శ్రద్ధలో కనీసం పదో వంతైనా మనవాళ్ళమీద మీకుందా? రెండేళ్ళనుంచీ రోడ్లు కొలుస్తున్న మన వాళ్ళకి ఆ మాత్రం వుద్యోగాలు మీరు తలచుకుంటే రాకపోవు ఏణ్ణర్థం నుంచి చేద్దాం, చేద్దాం అనుకుంటున్న మన రెండో అమ్మాయి పెళ్ళి జరక్కపోదు ఎలా జరుగుతుంది? ఎంతసేపూ వీళ్ళకి, వాళ్ళకీ వుద్యోగాలు, మార్కులు వేయించడంతోనే మీకు రోజులు గడిచిపోతున్నాయ్

"మన మూడోవాడు రెండోసారికూడా పదోక్లాసు తప్పేడు కదా? కనీసం వాడి గురించైనా మీరు శ్రద్ధ తీసుకుంటున్నారా? ఎందుకు శ్రద్ధ తీసుకుంటారు? ఊళ్ళో వాళ్ళని ఆదుకుంటే చాలదూ? ?" అన్నపూర్ణ వాక్ప్రవాహం!

"దేనికైనా కాలం, ఖర్మం కలసి రావాలే! మనవాళ్ళ బాగోగులు మనం పట్టించుకోకపోతే ఎవరు పట్టించుకుంటారు ఆ మాత్రం నాకు తెలవదనా?" అంటూ సీతాపతి ఆఫీసుకి వెళ్ళిపోయాడు


ఆ రోజు సీతాపతి ఆఫీసుకు పదినిముషాలు ఆలస్యంగా వెళ్ళేడు

తను సీట్లో కూర్చుని పదినిముషాలు కూడా కాలేదు ఆఫీసు బంట్రోతు రంగన్న వచ్చి "మిమ్మల్ని ఆఫీసరుగారు పిలుస్తున్నారు" చెప్పేడు సీతాపతితో

'ఈ మధ్య తను ఆలస్యంగా వస్తున్నాడు బహుశా ఆఫీసరు తనకు ఓ నాలుగు అక్షింతలు వేయడానికే పిలుస్తున్నాడు కాబోలు?' అనుకుంటూ సీతాపతి ఆఫీసరు దగ్గరకు వెళ్ళేడు

"మీ గురించి పావుగంట నుంచీ ఎదురుచూస్తున్నాను బహుశా మీరీవేళ రావడం లేదేమోనని అనుకుంటాను? అలా నిల్చుండి

జ్యోతి కథక్కార్టూన్ ముగింపులేని కథ




ఫోయారేం? కూర్చొండి" అంటూ ఆఫీసరు తనకెదురుగావున్న కుర్చీని చూపించేరు సీతాపతికి

'గురుడు డైరెక్టుగా అసలు పాయింటుకే వచ్చినా-ఆ మాటల్లో వ్యంగ్యంతో కూడిన ఎంత అదరణ? ఎంత ఆప్యాయత? ' సీతాపతి స్వగతం

"ప్లీజ్ సిట్ డౌన్?" ఆఫీసర్

'ఇక తప్పదు కూర్చుంటేనేగాని తనకు అక్షింతలు వేయడుకాబోలు?' అనుకుంటూ సీతాపతి కుర్చీలో కూర్చున్నాడు

"మా పెద్దవాడు హరిని మీకు తెల్సుగా? వాడు పదోక్లాసు చదువుతున్నాడు మొన్న హాఫ్ఇయర్లీ పరీక్షల ప్రోగ్రెస్ రిపోర్టు చాలా పూర్‌గావుంది

"అప్పుడే మీరు నాకు గుర్తొచ్చేరు ఎందుకైనా మంచిదని మీతో మాట్లాడదాఁవని మిమ్మల్ని పిలిపించేను."

"నాతో మాట్లాడ్డం దేనికండీ?" ఆశ్చర్యంగా అడిగేడు సీతాపతి

"మీ గురించి అంతా నాకు తెల్సండీ! తెల్సుకుంతర్వాతే మిమ్మల్ని పిలిపించేను· మీరు మా వాడికి మార్కులే వేయించి పాస్ చేయిస్తారో? — ప్రైవేటే చెప్పి పాసయేట్లు చూస్తారో? అదంతా మీకే వదిలేస్తున్నాను మా క్కావాల్సింది మావాడు పరీక్ష పాస్ కావడం! మీ పద్ధతికి నాకేం అభ్యంతరం లేదు పని జరగడం మాక్కావాల్సింది ఇది మీ దగ్గరుంచండి" అంటూ ఐదొందల రూపాయలకు 'చెక్' రాసిచ్చేరు

సీతాపతి కొన్నిక్షణాలు ఆశ్చర్యపోయాడు-తన విషయం అంత 'కరెక్ట్'గా ఆఫీసర్‌కి ఎలా తెల్సిందా?-అని

'చెక్' తీసుకుంటూ అన్నాడు సీతాపతి

"మా పెద్దబ్బాయి రాజు బి కాం పాసై

రెండేళ్ళనుంచీ ఖాళీగా వుంటున్నాడండీ! మీకు అభ్యంతరం లేకుంటే మా వాడు మీ హరిబాబుకి ఉదయం - సాయంత్రం ఇంటికొచ్చిప్రైవేటు చెబుతాడు ఆ తర్వాత విషయమంతా నే చూసుకుంటాను "

"ఓ యస్! అలాగే కానివ్వండి" ఆఫీసర్ ఆమోదం!

"మరి నే సెలవు తీసుకుంటాను" అంటూ సీతాపతి పైకొచ్చేశాడు

సీతాపతి పెద్దబ్బాయ్ ఆఫీసర్‌గారబ్బాయికి క్రమం తప్పకుండా ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ప్రైవేటు చెప్ప సాగేడు

కొన్ని నెలలు ముందుకి జరిగాయ్

సీతాపతి ప్రతి సంవత్సరంలాగే హైద్రాబాద్ వెళ్ళడం—పరీక్ష ఫలితాలు పేపర్లో వచ్చిన మరుసటి రోజున తనింటికి రావడం కూడా జరిగింది

ఈ సారి కూడా సీతాపతి అనుకున్నట్లుగా అంత మందీ 'పాస్' కాలేదు

ఏమాటకామాటే చెప్పుకోవాలి సీతాపతి దగ్గరకు వచ్చిన వాళ్ళలో చాలా మంది పాసయేరు ముఖ్యవిషయమేమంటే ఆశ వదులుకున్న ఆఫీసర్‌గారి అబ్బాయి కూడా మంచి మార్కులతో పాసయేడు

మళ్ళీ పాతకథే పునరావృతమైంది పాసైన వాళ్ళు, వాళ్ళపెద్దలు సీతాపతిని కలియడం-తమ సంతృప్తికోసమంటూ కానుకలు సమర్పించడం - ఫెయిలయిన వాళ్ళకి తన నియమం ప్రకారం మాట తప్పకుండా నీతిగా నిజాయితిగా ఇది వరలో తను తీసుకున్న డబ్బు వాళ్ళకి తిరిగి ఇచ్చేయడం-వాళ్ళచేత కూడా తను మెప్పుపొందడం జరిగింది

ఆఫీసరుగారు తమ సంతోషానికి, సంతృప్తికి చిహ్నంగా సీతాపతి పెద్దబ్బాయ్‌కి ఉద్యోగం ఇవ్వడం— సీతాపతి భార్య అన్నపూర్ణ-"అబ్బ ఎంత కాలానికి మీకు ఇంటిబాధ్యత పట్టిందండీ" అంటూ ఆశ్చర్యపోవడం కూడా జరిగింది

ఈ కథకి మొదలేకాని ముగింపులేదు
ఇది అంతంకాని కథ!
అంతులేని కథ!!

సీతాపతి క్రమం తప్పకుండా ప్రతి సంవత్సరం హైదరాబాద్ వెళ్తున్నది తన పెద్దమ్మాయిని చూడ్డానికి మాత్రమేనని గాని-నిజంగా తనకు పేపర్లు దిద్దే వాళ్ళెవరూ తెలియరనిగాని - ప్రైవేటు పిల్లలకు తన శాయశక్తులా పాఠాలు అర్థమయేలా చెప్పడం ద్వారానే వాళ్ళు పాసవుతున్నారన్న విషయంగాని—ఉద్యోగాల విషయంలో కూడా తనకు ఎటువంటి బలుకుబడీ లేదనిగాని—ఉద్యోగాలు రావడం, రాకపోవడం కేవలం అభ్యర్థుల అదృష్టంమీదేనన్న విషయంగాని సీతాపతిని అపద్బాంధవునిగా ఎంచి అతన్నిఆశ్రయిస్తున్న జనం తెల్సుకోలేనంత కాలం సీతాపతిలాంటి పెద్దమనుషుల కథలకి మొదలేగాని ముగింపు వుండదు!! □